# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :124 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 10 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 124 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 10 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## బీఎస్పీ, వామపక్షాలతో కాంగ్రెస్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్నికలకు మరో మూడు నెలల సమయం ఉండడంతో తెలంగాణ రాజకీయం వేడెక్కుతోంది. పదేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్ ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగానే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బీఆర్ఎస్‌లో సీట్లు ఆశించి భంగపడిన నేతలను కలిసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు ఆ పార్టీ నేతలు. బీఎఆర్ఎస్‌లో ఉన్న అసంతృప్తి నేతలకు కాంగ్రెస్

మిగతా 2లో...

మొరాకోను కుదిపేసిన

## శక్తివంతమైన భూకంపం

భూకంపం ధాటికి 600 మందికి పైగా మృతి



మొరాకో- ప్రభాత సూర్యుడు


శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మొరాకోలోని మర్రకేష్ ప్రాంతంలో 6.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ ప్రకృతి విపత్తులో భారీగా ప్రాణ నష్టం సంభవించింది. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటి వరకూ భూకంపం ధాటికి 600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ భూకంపం కారణంగా ఇప్పటి వరకూ 632 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఇంటీరియర్ మంత్రి వెల్లడించారు. సుమారు 329 మంది గాయాలపాలైనట్లు చెప్పారు. క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 51 మంది పరిస్థితి క్రిటికల్‌గా ఉన్నట్లు వెల్లడించారు. కాగా, మర్రకేష్‌కు


మిగతా 2లో...

## దేశ రాజధానిలో...

# జి-20 సమావేశాలు ప్రారంభం

### భారత్ మిమ్మల్ని స్వాగతిస్తోంది.... : నరేంద్రమోడీ





న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశ రాజధాని ఢిల్లీలో జీ20 సమావేశాలుఇవాళ ప్రారంభం అయ్యాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. భారత్ మండపంలో జరుగుతున్న కార్యక్రమానికి ఆయన తన టీమ్‌తో హాజరయ్యారు. ప్రధాని మోదీ ఆయనకు స్వాగతం పలికారు. భారత మండపంలో ఏర్పాటు చేసిన కోణార్క్ వీల్ వద్ద వివిధ దేశాధినేతలకు మోదీ షేక్ హ్యాండ్ ఇచ్చారు. బైడెన్ వచ్చిన సమయంలో కోణార్క్ వీల్ గురించి మోదీ వివరించారు. ఆ తర్వాత రౌండ్‌టేబుల్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. కొత్తగా జీ20లో సభ్యత్వం సాధించిన ఆఫ్రియా యూనియన్ అధినేతను ప్రధాని స్వాగతించారు. ఆయన్ను ఆలింగనం చేసుకుని కుర్చీలో కూర్చోపెట్టారు. మరో వైపు ప్రధాని మోదీ కూర్చున్న కుర్చీ వద్ద టేబుల్‌పై

మిగతా 2లో...

నీచ రాజకీయాలకు

## పాల్పడుతున్న బీజేపీ

మండిపడ్డ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

భారత్ అధ్యక్షతన దేశరాజధాని ఢిల్లీలో జరుగుతున్న జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం రాత్రి డిన్నర్ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ విందుకు దేశంలోని అన్ని పార్టీల నేతలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానాలు వెళ్లాయి. మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, హెచ్‌డీ దేవగౌడలకు కూడా ఆహ్వానం అందించింది. అయితే, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కు మాత్రం ఇప్పటి వరకూ ఆహ్వానం అందలేదు. దీనిపై కాంగ్రెస్ సహా విపక్షాలు మండిపడుతున్నాయి. తాజాగా ఈ అంశంపై ఖర్గే మౌనం వీడారు. ఇలాంటి

మిగతా 2లో...

విమోచన దినోత్సవం జరపకుండా

## కేసీఆర్ మోసం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

విమోచన దినోత్సవం జరపకుండా రాష్ట్ర ప్రజలను కేసీఆర్ మోసం చేశారని కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17న కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాలను పురస్కరించుకుని కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. నిజాం అరాచక పాలన నుంచి నాటి హైదరాబాద్ సంస్థానం విమోచన సందర్భంగా సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగరిందన్నారు. చరిత్రలో ప్రతీ ప్రత్యేక ఘట్టానికి ఉత్సాహంగా, పండగగా, వేడుకగా జరుపుకుంటాం.. కానీ తెలంగాణలో గత 75 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాలను అధికారికంగా జరపకపోవడం దురదృష్టకరమన్నారు. బీజేపీ గత 25 ఏళ్లుగా అధికారికంగా తెలంగాణ విమోచన ఉత్సవాలను నిర్వహించాలంటూ పోరాటం చేస్తుందని తెలిపారు. కానీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, నేటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదని అన్నారు. కానీ బీజేపీ ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. గతేడాది సెప్టెంబర్ 17న ఆజాదీకా అమృత్



మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా 'తెలంగాణ విమోచన ఉత్సవాలను' నిర్వహించామన్నారు. 75 ఏళ్ల క్రితం సర్దార్ వల్లభాయ్ పటేల్ త్రివర్ణ పతాకం ఎగరేస్తే.. 75 ఏళ్ల తర్వాత అభినవ సర్దార్ పటేల్ అమిత్ షా చేతుల మీదుగా గతేడాది హైదరాబాద్ లో ఉత్సవాలు జరిగాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి బీఆర్ఎస్ పార్టీ.. చీము నెత్తురుంటే తెలంగాణ విమోచన ఉత్సవాలు నిర్వహించాలని అధికారంలో ఉన్న

మిగతా 2లో...

హైదరాబాద్‌లో పెరుగుతున్న భూముల ధరలు

## కేవలం ట్రైలర్ మాత్రమే

అసలు సినిమా ముందుంది : ఐటీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్‌లో పెరుగుతున్న భూముల ధరలు, జరుగుతున్న అభివృద్ధి కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని ఐటీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఏ నగరమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతుల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సమష్టిగా, బ్యాలెన్సింగ్?గా పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హైదరాబాద్ హైటెక్స్?లో ఏర్పాటుచేసిన టైమ్స్ ఆఫ్ ఇండియా, టైమ్స్ మెగా ప్రాపర్టీ ఎక్స్ పో-2023ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సాగునీరు, తాగునీరు, వ్యవసాయ రంగం, పరిశ్రమలు, విద్యుత్.. ఇలా అన్ని రంగాలపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం ముందుచూపుతో దృష్టి సారించిందన్నారు. తెలంగాణ రాకముందు ఏడు వేల మెగావాట్ల విద్యుత్ ఉండేది, పవర్ హాలిడేస్?తో పరిశ్రమలకు సెలవులు కూడా ఇచ్చే వాళ్లని చెప్పారు. జిరాక్స్ సెంటర్ నడవాలన్నా కరెంటు ఉండేదికాదన్నారు. కానీ, నేడు రాష్ట్రంలో 26 వేల మెగావాట్ల విద్యుత్

మిగతా 3లో...

# 17 నుంచి బస్సు యాత్ర



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాషాయ పార్టీ క్యాడర్ లో జోష్ నింపడానికి ప్రణాళికలు రూపొందించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పదాధికారులు, జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ఇంఛార్జ్ లు ప్రకాశ్ జవదేవకర్, సునీల్ బన్సాల్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీ సోయం బాపురావు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 17న హైదరాబాద్ విమోచన వేడుకలను పరేడ్ గ్రౌండ్స్ లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో తెలంగాణ మూడు వైపుల నుంచి భారీ రథయాత్రలకు ప్లాన్ చేశారు. బాసర నుంచి హైదరాబాద్ వరకు ఒక ముఖ్య నేత నేతృత్వంలో యాత్ర.. సోమశిల నుంచి హైదరాబాద్ వరకు మరో ముఖ్య నేత ఆధ్వర్యంలో యాత్ర.. భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు ఇంకో ముఖ్య నేత లీడ్ చేస్తూ యాత్ర నిర్వహించనున్నారు. 19 రోజుల పాటు నాలుగు వేల కిలోమీటర్ల మేర యాత్రలు సాగనున్నాయి. క్యాడర్ లో జోష్ నింపడమే లక్ష్యంగా బస్సు యాత్రలు నిర్వహిస్తున్నారు. ఎవరు ? ఎక్కడ నుంచి ? బస్సు యాత్రలు చేస్తారనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ చెరో వైపు నుంచి యాత్ర చేయడం కన్ఫర్మ్ అయ్యింది. మూడో వైపు నుంచి యాత్ర ఎవరు చేయాలనే దానిపై సందిగ్ధత నెలకొంది. బండి సంజయ్, డీకే అరుణ ఇద్దరిలో ఎవరితో బస్సు యాత్ర చేయించాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. బీజేపీ, బీఆర్ఎస్ ఉత్తర, దక్షిణ ధృవాలని.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం ఒక్కటేనని మండల స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటీవలే ఇతర రాష్ట్రాల బీజేపీ ఎమ్మెల్యేలు పర్యటించి క్షేత్రస్థాయి రిపోర్ట్ ను అధిష్టానానికి అందించారు. వారు ఇచ్చిన రిపోర్ట్ లపై సమావేశంలో చర్చించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న నెగటివ్ విమర్శలను తిప్పికొట్టాలని నిర్ణయించారు. సనాతన ధర్మంపై తమిళనాడు ఉదయ్ నిధి వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 11న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని

మిగతా 3లో...

## బీఎస్పీ, వామపక్షాలతో కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

తలుపులు తెరిచే ఉంచింది. ఎవరైనా పార్టీలో చేరవచ్చని, వారికి తగిన గుర్తింపు ఇస్తామని చెబుతోంది. తాజాగా రాష్ట్రంలో వామపక్షాల పార్టీలో చర్చలు జరిపిన కాంగ్రెస్ అధిష్టానం పొత్తు దిశగా అడుగులు వేస్తోంది. అంతటితో ఆగకుంగా తమ బలాన్ని పెంచుకునేందుకు ఇతర పార్టీలతో పొత్తులకు యత్నిస్తోంది. తాజాగా బీఎస్పీతో పొత్తు పెట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అంగీకారం తెలిపిందని సమాచారం. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమి ఎ.ఔ.ఆ.ఎ.ంలో ఇప్పటికే కాంగ్రెస్, బీఎస్పీ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోను ఆ రెండు పార్టీలు పొత్తు పెట్టుకునే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఇప్పటికే వామపక్షాలు, బీఎస్పీ ఓటు శాతంపై రాష్ట్ర వ్యాప్తంగా సునీల్ కనుగోలు సర్వే నిర్వహించారు. ఇందులో వామపక్షాలకు 1.5 శాతం ఓటర్లు ఉన్నట్లు గుర్తించారని, ప్రవీణ్ కుమార్ సారధ్యంలోని బీఎస్పీ పార్టీ ఓటు శాతం 1 నుంచి 3 శాతానికి ఓట్లు పెంచుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే కాంగ్రెస్ ఈ రెండు పార్టీలతో స్నేహపూర్వకం, సానుకూలంగానే ఉంటూ వస్తోంది. దీంతో బీఎస్పీ, వామపక్షాలతో పొత్తులకు ఇబ్బంది ఉండదని, సీట్లు సర్దుబాటు చేసుకుంటే మూడు పార్టీల ఓట్లు బదలాయించుకునేలా ముందుకు సాగాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఫలితంగా అన్ని పార్టీలు ప్రయోజనం పొందవచ్చని కాంగ్రెస్ నేతలు చెప్పినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో తమ పార్టీ బలంగా ఉన్న పది స్థానాల్లో సీట్లు కేటాయించాలని బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ కోరగా సీపీఐ, సీఎం సైతం తమకు పది స్థానాలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే ఇప్పటికే కాంగ్రెస్‌లో సీట్ల కోసం ఒత్తిడి అధికంగా ఉంది. దీంతో సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా సీట్లను సర్దుబాటు చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. దీంతో బీఎస్పీ 10కి రెండు సీట్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పినట్లు తెలుస్తోంది. తెలంగాణలో బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ సమాధానం కోసం కాంగ్రెస్ ఎదురు చూస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సిర్పూర్ కాగజ్ నగర్‌లో నిర్వహించిన సర్వేలో ప్రవీణ్ కుమార్‌కు అనుకూలంగా ఉండడంతో ఆ స్థానాన్ని ఆయనకు ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తోంది. అదనంగా మరో సీటు ఆదిలాబాద్‌లో ఇచ్చి బీఎస్పీకి నచ్చజెప్పాలని కాంగ్రెస్ యోచిస్తోంది. మునుగోడు, వైరా, కొత్తగూడెం, బెల్లంపల్లి, హుస్నాబాద్ కేటాయించాలని సీపీఐ కోరగా, ఇబ్రహీంపట్నం, భద్రాచలం, పాలేరు, మిర్యాలగూడ, పినపాక టికెట్లు కావాలని సీపీఎం కోరుతన్నట్లు తెలుస్తోంది. అయితే ఆయా పార్టీలకు చెరో రెండు స్థానాలు ఇచ్చి ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇవ్వాలని పార్టీ అధిష్టానం సూచించినట్లు సమాచారం. అధికార బీఆర్?ఎస్?లో అసంతృప్తిగా ఉన్న పలువురు కీలక నేతలు హస్తం గూటికి చేరేందుకు ముహూర్తం దాదాపుగా ఖరారైంది. ఈ నెల 17న బహిరంగ సభ ఉన్న నేపథ్యంలో పార్టీలో పెద్ద ఎత్తున నేతల చేరికలు ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మైనం పల్లి హనుంతరావు మెదక్ సీటుతో పాటు మరో స్థానం ఇవ్వాలని కోరుతుండడంతో మెదక్‌కు కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. మరో సీటు కావాలంటే కూకట్ పల్లి నుంచి పోటీ చేయాలని సూచించినట్లు సమాచారం. అలాగే వేముల వీరేశం, యెన్నం శ్రీనివాసులు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరంతా సోనియా, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. అలాగే తుమ్మల నాగేశ్వర రావు పార్టీలో చేరితే ఖమ్మం లేదా పాలారు సీటు కేటాయించే అవకాశం ఉంది. మరోవైపు పార్టీలో అసంతృప్తితో ఉన్న ఎంపీ కోమటిరెడ్డికి త్వరలోనే సముచిత స్థానం కల్పిస్తామని కేసీ వేణుగోపాల్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## నీచ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో రాజకీయాలు చేయకూడదంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రత్యక్ష దాడికి దిగారు. ఢిల్లీలో నేడు జరిగే జీ20 విందుకు ఆహ్వానం అందకపోవడంపై ఖర్గే మాట్లాడుతూ.. 'నేను ఇప్పటికే దీనిపై స్పందించాను. మా పార్టీ స్పందించింది. ఇలా చేయడం మంచి పద్ధతి కాదు. వారు (బీజేపీ) ఇలాంటి నీచ రాజకీయాలు చేయకూడదు' అని వ్యాఖ్యానించారు. కాగా, ఈ విందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులకు కూడా ఆహ్వానం వెళ్లింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు కూడా ఆహ్వానం వెళ్లినట్లు తెలుస్తోంది. బీహార్ సీఎం నితీశ్ కుమార్‌తో పాటు ఇండియా కూటమిలో ఉన్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌లకు ఆహ్వానం అందించింది. వీరిలో కొందరు నేతలు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. కాగా, దేవగౌడకు ఆహ్వానం అందినప్పటికీ ఆయన విందుకు దూరంగా ఉండనున్నారు. అనారోగ్య కారణాల వల్ల విందుకు హాజరుకావడం లేదని ఆయనే ట్విట్టర్ ద్వారా స్వయంగా వెల్లడించారు.

## మొరాకోను కుదిపేసిన శక్తివంతమైన భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

71 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూ అంతర్భాగంలో 18.5 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని తెలిపింది. ఆల్ హౌజ్, మర్రకేష్, క్వార్జాజేట్, అజిలాల్ సహా పలు ప్రావిన్సుల్లో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు వెల్లడించింది. శతాబ్దకాలంలో ఉత్తరాఫ్రికా ఈ స్థాయి భూకంపాన్ని ఇప్పటి వరకూ చవిచూడలేదని యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. మరోవైపు భూకంపం తీవ్రత ఎక్కువగా ఉండటంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

# దేశ రాజధానిలో జి-20 సమావేశాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఉండే దేశం నేమ్‌ప్లేట్‌పై భారత్ అని రాసి ఉంది. గత కొన్ని రోజుల నుంచి దేశం పేరు మార్పు గురించి తీవ్ర స్థాయిలో చర్చ సాగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు అంతర్జాతీయంగా భారత్‌ను ఇండియాగా గుర్తించే వారు. ఇప్పుడు తొలిసారి ఓ అంతర్జాతీయ సమావేశంలో ఇండియాను భారత్‌గా గుర్తిస్తూ.. రౌండ్‌టేబుల్‌పై దేశం నేమ్‌ప్లేట్‌ను ఏర్పాటు చేశారు. జీ20 ప్రతినిధులను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న చైర్ వద్ద ఉన్న నేమ్‌ప్లేట్‌లో భారత్ అని రాసి ఉంది. మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. భారత్ మిమ్మల్ని స్వాగతిస్తోందన్నారు.

### విస్తరించిన జీ 20

#### ఆఫ్రికా దేశాలకు సభ్యత్వం కల్పించిన మోడీ

దేశ రాజధాని ఢిల్లీలో జీ20 సమావేశాలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ సమావేశంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం ఇచ్చారు. శనివారం భారత్ మండపంలో జరిగిన వన్ ఎర్త్ సెషన్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ ప్రసంగంలోనే ఆయన ఈ విషయాన్ని ప్రతిపాదన చేశారు. అందరు సభ్యుల అంగీకారంతో ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం ఇస్తున్నట్లు ప్రకటన చేశారు. ఆ తర్వాత ఆఫ్రికన్ యూనియన్ అధినేతను శాశ్వత సభ్యులకు కేటాయించినటువంటి కుర్చీలో కూర్చోబెట్టారు. అయితే ఈ సదస్సులో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ మొరాకోలో సంభవించిన భూకంప మృతులుక సంతాపాన్ని తెలియజేస్తున్నానని చెప్పారు. ప్రపంచం మొత్తం మొరాకోకు అండగా నిలవాలని కోరారు. వారికి అవసరమైన సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అలాగే జీ20 అధ్యక్ష హోదాలో భారత్ మీకు స్వాగతం పలుకుతోందంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 21వ శతాబ్దంలో ప్రపంచానికి కొత్త దిశ, దశను సూచించేందుకు ఇదే కీలకమైన సమయమని పేర్కొన్నారు. ఇప్పటిదాకా ఉన్నటువంటి పాత సవాళ్లు ఇప్పుడు కొత్త సమాధానాలు కోరుతున్నాయని.. అందుకునే మనం హ్యూమన్ సెంట్రిక్ అప్రోచ్‌తో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. కరోనా సంక్షోభం వచ్చిన తర్వాత ప్రపంచ దేశాల్లో విశ్వాస రాహిత్యం ఏర్పడిందని.. యుద్ధం ఈ అపనమ్మకాన్ని మరితంగా పెంచేసిందని అన్నారు. కరోనాను ఓడించిన మనం ఈ విశ్వాస రాహిత్యంపై విజయం సాధించగలమని పేర్కొన్నారు. మనమందరం కలిసి ప్రపంచంలో నెలకొన్నటువంటి అపనమ్మకాన్ని పారదోలుదామని.. ఈ క్రమంలోనే సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ మంత్రం మనకు మార్గదర్శకంగా ఉంటుందని వివరించారు. అలాగే ప్రపంచంలో పేద, సంపన్న దేశాల మధ్య భేదాలు? ఆహారం, ఇంధనం నిర్వహణ, ఆరోగ్యం, ఎనర్జీ, నీటీ భద్రత వంటి వాటిలో నెలకొన్న సమస్యలకు సమాధానం కోసం ముందుకు వెళ్లాల్సిందేనని పేర్కొన్నారు. భారత్ జీ20 అధ్యక్షతన.. దేశం లోపల, బయట అందరిని కలుపుకోని పోయేందుకు ప్రతీకగా నిలిచినట్లు తెలిపారు. అయితే ఇది ప్రజల జీ20 అనడానికి నిదర్శనంగా మారినట్లు పేర్కొన్నారు. దేశంలోని 70కి పైగా నగరాల్లో 200లకు పైగా జీ20 సదస్సులు జరిగినట్లు వెల్లడించారు. సబ్‌కా సాత్ అనే భావనతోనే ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20 సభ్యత్వం ఇవ్వాలని భారత్ ప్రతిపాదన చేస్తోందని.. దీనికి అంగీకరిస్తారని నమ్ముతున్నానని అన్నారు. అలాగే మీ అందరి అనుమతితో జీ20 సభ్యుడి హోదాలో ఆఫ్రికన్ యూనియన్ అధ్యక్షుడు గ్రూపులో స్థానాన్ని స్వీకరించాలని ఆహ్వానిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. ఇదిలా ఉండగా మోదీ కూర్చున్న స్థానంలో ఇండియాకు బదులుగా భారత్ అనే నేమ్‌ప్లేట్ ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచానికి కొత్త దిశ చూపించాలి: ప్రధానిప్రపంచానికి కొత్త దిశ చూపించడానికి ఈ 21 వ శతాబ్దం ఎంతో కీలకమైన సమయం. పాత సమస్యలకు కొత్త పరిష్కారాలు వెతుక్కోడానికి ఇదే మంచి తరుణం. అందుకే మానవాభివృద్ధి కేంద్రంగానే విధానాలు రూపొందించాల్సిన అవసరముంది. కొవిడ్ లాంటి మహమ్మారిని జయించగలిగితే...యుద్ధాల వల్ల ప్రజలు కోల్పోతున్న నమ్మకాన్నీ తిరిగి నిలబెట్టగలం. "జీ20 సదస్సుకి భారత్ అధ్యక్షత వహించడం ఐక్యతకు చిహ్నం. సబ్‌కా సాథ్ అనే నినాదం కేవలం దేశానికే పరిమితం కాదు. ప్రపంచానికీ వర్తిస్తుంది. ఈ సదస్సుని లీడ్ చేస్తోంది భారత దేశ ప్రజలే. కోట్లాది మంది దేశ పౌరులు పరోక్షంగా ఈ సదస్సులో భాగస్వాములై ఉన్నారు. దేశంలోని 60 నగరాల్లో దాదాపు 200 సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా భారత్ ఓ విజ్ఞప్తి చేస్తోంది. ఆఫ్రికన్ యూనియన్‌కి జీ20 దేశాల్లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదనకు అందరూ అంగీకరిస్తారని ఆశిస్తున్నాను"ప్రధాని నరేంద్ర మోదీ కూర్చున్న స్థానంలో ముందు నేమ్‌ప్లేట్ ఆసక్తికరంగా మారింది. దానిపై ఎనిటతిజీ కి బదులుగా ఃప్త్రజీతీజీబి అని రాసుంది. పేరు మార్పుపై ఇప్పటికే చర్చ జరుగుతుండగా ప్రధాని మోదీ నేమ్‌ప్లేట్‌పై ఆ పేరు కనిపించింది. మొరాకోకి సాయం అందించేందుకు సిద్ధం: ప్రధానిప్రధాని నరేంద్ర మోదీ ఉ20 సదస్సుని ప్రారంభించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. మొరాకోలో భూకంప విపత్తులో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. గాయపడ్డవాళ్లు వీలైనంత త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ఈ కష్టకాలంలో మొరాకో దేశానికి ఎలాంటి సాయమైనా అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఒడిశా కోనార్క్ వీల్ వద్ద నిలబడి ప్రధాని నరేంద్ర మోదీ20 సదస్సు దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైంది.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే కాకుండా చారిత్రాత్మకంగా మార్చేందుకు ప్రత్యేక సన్నాహాలు చేశారు. విదేశీ అతిథులు వచ్చే చోట భారతీయ సంస్కృతికి సంబంధించిన చిహ్నాలను ఏర్పాటు చేశారు. ఇవన్నీ ఈవెంట్ యొక్క అందాన్ని జోడించడమే కాకుండా.. భారతదేశ గొప్ప సంస్కృతిని, చారిత్రక వారసత్వం గురించి ప్రపంచానికి తెలుసుకునే అవకాశం కూడా లభిస్తుంది. భారత్.. ఇంతమంది దేశాధినేతలకు తన సంస్కృతిని ప్రదర్శించడానికి ఇంతకంటే మంచి అవకాశం దొరకదనే చెప్పొచ్చు. ఈ క్రమంలోనే ఈరోజు జీ20 సదస్సుకు వేదికైన భారత మండపంలో.. ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన కోణార్క్ చక్రాన్ని ప్రదర్శించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ అతిథులకు వివరించారుఇక వివరాల్లోకి వెళ్తే.. ఈ కోణార్క్ చక్రం 13వ శతాబ్దంలో రాజు నరసింహదేవ్-ఎ పాలనలో నిర్మించబడింది. ఈ చక్రం భారతదేశ ప్రాచీన జ్ఞానం, నాగరికత, వాస్తుశిల్పం ఔన్నత్యానికి చిహ్నం. కోణార్క్ చక్రం యొక్క భ్రమణం కాలచక్రంతో పాటు పురోగతి, నిరంతర మార్పును సూచిస్తుంది. ఇది ప్రజాస్వామ్య చక్రానికి శక్తివంతమైన చిహ్నంగా కూడా పనిచేస్తుంది. ఇది ప్రజాస్వామ్య ఆదర్శాలకు, సమాజంలో పురోగతి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అయితే ఈ చక్రం ఒడిశాలోని కోణార్క్‌లో ఉన్న సూర్య దేవాలయంలో నిర్మించారు. భారత కరెన్సీ నోట్లపై కూడా ఈ కోణార్క్ చక్ర ముద్రించబడి ఉండటాన్ని మనం చూడచ్చు. ఒకప్పుడు 20 రూపాయల నోటుపై ముద్రించి, ఆపై 10 రూపాయల నోటుపై ముద్రించేవారు. కోణార్క్ చక్రం 8 వెడల్పు చువ్వలు.. అలాగే 8 సన్నని చువ్వలు కలిగి ఉంటుంది. ఆలయంలో 24 (12 జతల) చక్రాలు ఉన్నాయి. ఇవి సూర్యుని రథ చక్రాలను సూచిస్తాయి. 8 కర్రలు రోజులోని 8 గంటల గురించి చెబుతాయి. దీన్ని ఉపయోగించి, సూర్యుని స్థానం ఆధారంగా సమయాన్ని లెక్కిస్తారని నమ్ముతారు. చక్రం పరిమాణం 9 అడుగుల 9 అంగుళాలు. 12 జతల చక్రాలు సంవత్సరంలోని 12 నెలలను సూచిస్తాయని మరియు 24 చక్రాలు రోజులోని 24 గంటలను సూచిస్తాయని కూడా నమ్ముతారు. ఇదిలా జీ20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా వివిధ దేశాధినేతలు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. భారత్ మండపంలో జరుగుతున్నటువంటి ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ వారందరికి స్వాగతం పలికారు. ఆ తర్వాత రౌండ్ టేబుల్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. మరో విషయం ఏంటంటే కొత్తగా జీ20లో సభ్యత్వం సాధించిన ఆఫ్రికా యూనియన్ అధినేతనకు ప్రధాని స్వాగతం తెలిపారు. ఆయన్ని ఆలింగనం చేసుకోని కూరిచులో కూర్చోబెట్టారు. మరోవైపు ప్రధాని మోదీ కూర్చున్నటువంటి టేబుల్‌పై దేశం నేమ్‌ప్లేట్‌పై భారత్ అని రాసి ఉంది. గత కొన్ని రోజుల నుంచి ఇండియా పేరును భారత్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చనుందని జోరుగా ప్రచారాలు నడుస్తున్నాయి. ఇప్పటివరకు అంతర్జాతీయ స్థాయిలో చూసుకుంటే భారత్‌ను ఇండియాగా గుర్తించేవారు.

అయితే ఇప్పుడు తొలిసారిగా ఓ అంతర్జాతీయ సమావేశంలో ఇండియాకు బదులుగా భారత్ అని గుర్తిస్తూ రౌండ్ టేబుల్‌పై భారత్ అనే నేమ్‌ప్లేట్‌ను ఏర్పాటు చేశారు. ఇక ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ భారత్ మిమ్మల్ని స్వాగతిస్తుందని అన్నారు. కోణార్క్ చక్రపై ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ ఇదే..కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జీ20 సదస్సుపై ట్విట్టర్ వేదికగా మరోసారి కీలక కామెంట్స్ చేశారు. ఒడిశా రాష్ట్రం సంస్కృతి, వారసత్వానికి జీ20 సదస్సులో గర్వించదగిన స్థానం కలిగిందని చెప్పారు. కోణార్క్ చక్ర అనేది భావి, భవిష్యత్తు తరాలకు సంబంధించిన నాగరికత భవనాలను వివరించే ఓ నిర్మాణ అద్భుతమన్న ధర్మేంద్ర ప్రధాన్.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు భారతదేశ వారసత్వం, విజ్ఞాన సంప్రదాయాల ప్రాముఖ్యతను ప్రధాని నరేంద్ర మోదీ వివరించడం.. ఓ అందమైన దృశ్యంగా ఉందని కేంద్రమంత్రి ట్వీట్ చేశారు. ఉ20 సదస్సుకి వస్తున్న అతిథులకు స్వాగతం పలుకుతుండటం ఆసక్తికరంగా మారింది. యూకే ప్రధాని రిషి సునాక్ భారత్ మండపానికి చేరుకున్నారు. ప్రధాని మోదీ ఆయనను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ఆహ్వానం పలికారు. భారత్ మండపానికి చేరుకున్న ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడోని ప్రధాని ఆత్మీయంగా స్వాగతించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకియో భారత్ మండపానికి చేరుకున్నారు. ప్రధాని మోదీ ఆయనకు షేక్‌హ్యాండ్ ఇచ్చి స్వాగతం పలికారు. చైనా ప్రెసిడెంట్ జిన్‌పింగ్ రాకపోయినా ఆ దేశ ప్రధాని లీ క్వియాంగ్ ఉ20 సదస్సుకి హాజరయ్యారు. భారత్ మండపం వద్ద ప్రధాని మోదీ ఆయనను స్వాగతించారు.

# విమోచన దినోత్సవం జరపకుండా కేసీఆర్ మోసం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ అధికారం చేపట్టిన ఈ తొమ్మిదేండ్లలో ఎందుకు ఈ విమోచన ఉత్సవాలు జరపలేదు? అని ప్రశ్నించారు. ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారు? అని అడిగారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కు నిజంగా చీము, నెత్తురు ఉంటే ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేస్తుందని అన్నారు. మజ్లిస్ పార్టీని సంతృప్తి పరిచేందుకే ఇవాళ కేసీఆర్ ఈ ఉత్సవాలను నిర్వహించడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ కలిసి.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను తప్పుదోవ పట్టించేప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేంద్రం నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్న సందర్భంలో.. తెలంగాణ సమాజాన్ని కోరుతున్నానని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా ఈ సందర్భంగా ప్రజలను కోరుతున్నానని తెలిపారు. కేంద్రం అధీనంలో ఈ ఏడాది కూడా పరేడ్ గ్రౌండ్లో విమోచన దినోత్సవం వేడుకలు జరుగుతాయని తెలిపారు. దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తున్నయని తెలిపారు. ఆ రోజు రాజకీయ సభలకు ప్లాన్ చేసారని అన్నారు. అమిత్ షా పాల్గొనే కార్యక్రమాన్ని దెబ్బతీసే ప్రయత్నం బీఆర్ఎస్ కాంగ్రెస్ చేస్తున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. సెప్టెంబరు 17 సాయంత్రం రాష్ట్రపతి భవన్లో తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఇది తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ వేడుకలలో పోరాట యోధులకు నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు. మీరు మీటింగులు పెట్టుకుంటే మాకు అభ్యంతరం లేదు కానీ సెప్టెంబర్ 17 నే ఎందుకు పెట్టుకున్నారు? అని ప్రశ్నించారు. గత ఏడాది కేంద్ర ఆధ్వర్యంలో జరిగిన విమోచన దినోత్సవ వేడుకలకు రాకుండా కేసీఆర్ డుమ్మా కొట్టారని తెలిపారు. ఈ ఏడాది కూడా కేసిఆర్ కు విమోచన దినోత్సవం వేడుకలకు ఆహ్వానం పంపిస్తామన్నారు. సీఎం విమోచన దినోత్సవం వేడుకకు రావాలని తెలిపారు.

## సంపాదకీయం

### ఏకాభిప్రాయం దిశగా

# జీ 20 అడుగులు

రెండు రోజుల జీ?20 శిఖరాగ్ర సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ చరిత్రాత్మక సమావేశాలకు వివిధ దేశాధినేతలతోపాటు తరలివచ్చే వారి మంత్రులు, ఉన్నతాధికార గణం, వేలాదిమంది సిబ్బందితో దేశ రాజధాని నగరం సందడిగా మారింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 85 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాలు జీ?20లో సభ్యదేశాలుగా ఉన్నాయి. భారత్‌కు అధ్యక్ష హోదా వంతులవారీగా వచ్చిందే కావొచ్చుగానీ, వచ్చిన సమయం అత్యంత కీలకమైనది.'ఒకే భూమి ? ఒకే కుటుంబం ? ఒకే భవిష్యత్తు' మకుటంతో నిర్వహిస్తున్న ఈ శిఖరాగ్ర సదస్సు విజయవంతమైతే ఆ కీర్తిప్రతిష్ఠలు మనకే దక్కుతాయి. అయితే దేశాలు చీలికలు పేలికలుగా విడిపోయిన వర్తమాన యుగంలో అదెంతవరకూ సాధ్యమో చెప్పలేం. మారిన అంతర్జాతీయ పరిస్థితులు ఐక్యరాజ్యసమితి మొదలుకొని డబ్ల్యూహెచ్‌ఓ, డబ్ల్యూటీవో వరకూ అనేకానేక వేదికలపై ప్రతిబింబిస్తున్నప్పుడు జీ?20 వాటికి భిన్నంగా ఉండాలనుకోవటం అత్యాశే కావొచ్చు. కానీ సామరస్యత కోసం ప్రయత్నించటం కొనసాగాలి.రష్యా, చైనా ఒక పక్క? అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి సంపన్న దేశాలు మరో పక్క మోహరించివున్న ప్రస్తుత వాతావరణంలో పేద దేశాల స్వరాన్ని గట్టిగా వినిపించాల్సిన చారిత్రక అవసరం ఎంతో ఉంది. ధనిక, బీద దేశాలకు సభ్యత్వం ఉండి, వాటిమధ్య సంభాషణలు సాగే అతి తక్కువ అంతర్జాతీయ వేదికల్లో జీ?20 ఒకటి. అగ్ర దేశాల పంచాయతీకే ఈ సంస్థ పరిమితమైతే పేద దేశాల సమస్యలకు చోటుండదు. పేద దేశాల సమస్యలు సాధారణమైనవి కాదు. ఇన్నేళ్లూ అభివృద్ధి పేరుతో, లాభార్జనే ధ్యేయంగా ధనిక దేశాలు విచ్చలవిడిగా వినియోగించిన శిలాజ ఇంధనాల కారణంగా వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగి భూగోళం వేడెక్కింది.కరోనా మహమ్మారి పర్యవసానంగా ప్రపంచం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అంతో ఇంతో కోలుకుంటుండగా ఉక్రెయిన్‌లో రష్యా మొదలెట్టిన దురాక్రమణ యుద్ధం మరింత కుంగదీసింది. పైకి రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య పోరుగా కనబడుతున్నా అక్కడ వాస్తవంగా తలపడుతున్నది అమెరికా, రష్యాలే. ఇటు అమెరికా?చైనాల మధ్య తీవ్ర వైరుధ్యాలు న్నాయి. చైనాకూ మనకూ మధ్య ఉన్న సమస్యలు సరేసరి. సరిహద్దుల్లో ఏదో సాకుతో గిల్లికజ్జాలకు దిగటం, కొత్త మ్యాప్‌లు ముద్రిస్తూ కవ్వించాలని చూడటం చైనాకు రివాజైంది.ఈ సమస్యలేవీ జీ?20లో ప్రస్తావనకు రాకున్నా, ఎజెండాలో ఈ అంశాలే లేకున్నా, వాటి నీలినీడలు శిఖరాగ్ర సదస్సుపై పడకతప్పదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ సమావేశాలకు హాజరు కాబోరని ఆ దేశం ప్రకటించింది. ఉక్రెయిన్ విషయంలో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంట్ నేపథ్యమే ఇందుకు కారణం. ఇక అమెరికాతోపాటు మనపైనున్న కంటగింపు పర్యవసానంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ముఖం చాటేశారు. ఆయన బదులు పెద్దగా అధికారాలు లేని ప్రధాని లీ కియాంగ్‌ను ఆ దేశం పంపుతోంది. ప్రపంచ ఆర్థిక, ద్రవ్య సంబంధ అంశాలతోపాటు మారిన కాలానికి అనుగుణమైన నియంత్రణ వ్యవస్థలను అమల్లోకి తీసుకురావటం, వాతావరణ సమస్యలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలు, కార్పొరేట్ దిగ్గజ సంస్థలపై విధించే పన్నులు, బహువిధ అభివృద్ధి బ్యాంకులను వర్తమాన అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దటం వంటి అంశాలు జీ?20లో ప్రధానంగా చర్చకు రాబోతున్నాయి. వీటన్నిటిపైనా ఎంతవరకూ ఏకాభిప్రాయం కుదురుతుందో, శిఖరాగ్ర సమావేశాల అనంతరం సంయుక్త ప్రకటన వెలువడేందుకు ఏమాత్రం అవకాశం ఉంటుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు.దక్షిణార్ధ గోళంలో ఉన్న పేద దేశాలకే అధిక నష్టం సంభవిస్తోంది. వచ్చే నవంబర్ నెలాఖరులో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన దుబాయ్‌లో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సీఓపీ) సదస్సు జరగబోతోంది. పర్యావరణ సమస్యలన్నీ అక్కడే చర్చించవచ్చునని ధనిక దేశాలు తప్పించుకునే ప్రయత్నం చేయొచ్చు. దీన్ని సాగనీయకూడదు. 2021లో రోమ్‌లో జీ?20 శిఖరాగ్ర సదస్సు జరిగినప్పుడు 'అర్థవంతమైన చర్యల ద్వారా భూగోళానికి ముప్పు కలగకుండా చూస్తామనీ, విదేశాల్లోని బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కర్మాగారాలకు ఆర్థిక సాయం అందకుండా చూస్తామ'నీ ధనిక దేశాలు హామీ ఇచ్చాయి.ఈ వాగ్దానంలో ధనిక దేశాల్లోని కర్మాగారాల ఊసు లేదు. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి రికార్డు స్థాయికి చేరింది. వర్తమాన సంవత్సరంలో ఈ రంగంలో పెట్టు బడులు ఎన్నడూ లేనంతగా 15,000 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని అంచనా. అంటే రోమ్‌లో చేసిన బాసలకు విలువే లేదన్న మాట. దీనిపై ప్రస్తుత సదస్సులో నిలదీయాలి. జీ?20 సభ్యత్వంలోనూ ఎన్నో తిరకాసులున్నాయి. నూతన ఆర్థిక శక్తిగా ఎదగటం మాట అటుంచి, కనీసం 20 ఉన్నత స్థాయి ఆర్థిక వ్యవస్థల్లో కూడా ఒకటిగా లేని అర్జెంటీనాకు సంస్థలో సభ్యత్వం ఉంది. పోర్చుగల్ ఈజిప్టు వంటి దేశాలకు చోటులేదు. ఒక సంస్థగా చెప్పుకోదగిన విజయాలు ఎందుకు సాధించలేదో, అందుకు అడ్డుపడు తున్నవేమిటో జీ?20 ఆత్మవిమర్శ చేసుకోవాలి. భవిష్యత్తరాలకు సురక్షితమైన భూగోళాన్ని అప్పగించాలంటే సంపన్న దేశాలుగా తాము చేయాల్సిందేమిటో అమెరికా, రష్యా, చైనా తదితర దేశాలు ఆలోచించాలి. అంతర్జాతీయ సంబంధాలు ఛిద్రమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు తలకిందులయ్యే ప్రమాదం ఉంటుందని గుర్తెరిగి ధనిక దేశాలు బాధ్యతగా మెలగాలి.

## జగిత్యాల బిజెపి అసెంబ్లీ అభ్యర్థిగా డా.శైలేందర్ రెడ్డి దరఖాస్తు

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు:** జగిత్యాల అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థిగా తాను పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని బిజెపి నాయకులు డా.ఎడమల శైలేందర్ రెడ్డి హైద్రాబాద్ లోని బిజెపి కార్యాలయంలో దరఖాస్తు చేశారు. శనివారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే టికెట్ ను ఆశిస్తూ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డా.శైలేందర్ రెడ్డి తన అప్లికేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా డా.శైలేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వతహాగా వైద్యుడిగా నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడనన్నారు. బీజేపీలో చేరిన నాటి నుంచి ప్రజల మధ్యలో ఉంటూ బిజెపి లక్ష్యాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలకు చేరువలో ఉన్నానన్నారు. బీజేపీ రాష్ట్ర పార్టీ తన దరఖాస్తును పరిశీలించి పోటీకి అవకాశం ఇస్తే విజయం సాధించేందుకు అందరి సహకారంతో కృషిచేస్తానని డా.శైలేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట సారంగాపూర్ మండల అద్యక్షులు ఎండబెట్ల వరుణ్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కోశాధికారి కొక్కిన సత్యం గౌడ్, కోటగిరి వినయ్ కుమార్, బండపల్లి రాజశేఖర్, బద్దం వేణుగోపాల్ రెడ్డి లు ఉన్నారు.



# 21న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

హైదరాబాద్ లో రెండో విడత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ నెల 21న హైదరాబాద్ పరిధిలో 13,300 ఇండ్లు పంపిణీ చేయనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ లో రెండో విడత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ముహూర్తం ఖరారైంది. ఈ నెల 21న రెండో విడతలో దాదాపు 13,300 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇళ్ల పంపిణీ కార్యక్రమంపై రాష్ట్ర సచివాలయంలో మంత్రులు తలసాని, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రి కేటీఆర్ సమావేశం నిర్వహించారు. లబ్దిదారుల ఎంపికలో ప్రజాప్రతినిధుల ప్రమేయంలేదని మంత్రి కేటీఆర్ తెలిపారు. లబ్దిదారులు ఎంపిక పూర్తిగా అధికారుల బాధ్యత అన్నారు. కంప్యూటర్ ఆధారికి డ్రా తీసి లబ్దిదారులను ఎంపికి చేస్తున్నట్లు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న ఆయన.. ఎంపిక పారదర్శకంగా మీడియా ముందు నిర్వహిస్తామన్నారు. మొదటి దశలో 11,700 ఇళ్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పేదలకు పంపిణీ చేశామని తెలిపారు. ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగితే అధికారులదే పూర్తిస్థాయి బాధ్యత అన్నారు.



తప్పు చేసిన అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించే స్థాయిలో చర్యలు ఉంటాయని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో త్వరలో గృహలక్ష్మి పథకం కూడా అమలుచేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ పథకానికి సంబంధించి హైదరాబాద్ పరిధిలో కొన్ని మార్పులు చేర్పులు చేయాలని మంత్రులు సీఎంను కోరారన్నారు. వారి సూచనలను సీఎం సూచన ప్రాయంగా అంగీకరించారని తెలిపారు. హైదరాబాద్ లో నోటరీ ప్రాపర్టీల అంశం మార్గదర్శకాలు ఇస్తామన్నారు. 58, 59 జీవోలతో ప్రజలకు ఉపశమనం లభించిం దన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.9100 కోట్లు ఖర్చయిందని మంత్రి కేటీఆర్ తెలిపారు.

### 15న మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం

ఈ నెల 15వ తేదీన 9 జిల్లాల్లో మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో మంత్రి కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 15వ తేదీన జరిగే మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయా జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని కేటీఆర్ తెలిపారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందన్నారు. రాష్ట్రంలోని జనగామ, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, అసిఫాబాద్, భూపాలపల్లి, వికారాబాద్, ఖమ్మం జిల్లాలలో నూతన మెడికల్ కాలేజీలను ఈనెల 15వ తేదీన ప్రారంభించుకోబోతున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఒక మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో పాల్గొనున్నారు.

# గొర్రెల దొంగల ముఠా అరెస్ట్

**వికారాబాద్- ప్రభాత సూర్యుడు:** గత 10 ఏళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా మేకలను ,గొర్రెలను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను పోలీసులు పట్టుకున్నారు .రాత్రి వేళల్లో మేకలను, గొర్రెల దోగతన్నానికి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను చంగోముల్ పోలీసులు పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం రేగడి మామిడిపల్లి గ్రామానికి చెందిన మల్కపురం రాములుకు చెందిన 20 గొర్రెలను పోలంవద్ద నుండి గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని చెంగోముల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు . మరో వ్యక్తి చేవెళ్ల మండలం అల్లాడ గ్రామానికి చెందిన మానేయకు చెందిన 20 గొర్రెలను దొంగిలించారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు చెంగోముల్ పోలీసులు, జిల్లా ఇఇబ పోలీసులతో కలిసి సామూహికంగా చేసిన దర్యాప్తులో సెల్ ఫోన్ సిగ్నల్, టెక్నికల్, సీసీటీవీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కర్నూల్ జిల్లా చెందిన ఎనిమిది మంది దొంగల ముఠాలో యమ్మూర్, దేవనకొండ, పెద్ద కడవూర్ మండలాలకు చెందిన ఉప్పరి రామాంజనేయులు, ఉప్పరి బోడన్న, షేక్ బడేశా వాలి, సైయద్ బడేశా వాలి బోయ నరేశ్ లుగా పోలీసులు గుర్తించారు. పూడురు మండలంలో దొంగిలించిన గొర్రెలను జియ్యాగూడ గొర్రెల సంతలో విక్రయించడానికి రాగా అఆూ బృందంతో కలిసి చన్గోముల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిగి అవి కార్యాలయంలో పోలీసులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను మిడియా ముందు ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా పరిగి ఆూఖ కరుణాసాగర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలకు దూరంగా, పొలాల వద్ద ఉండే గొర్రెలను టార్గెట్ గా చేసుకొని , ఈ ముఠా అధునుచుసి దొంగ తనానికి పాల్పడుతున్నారని తెలంగాణ సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో సైతం గొర్రెల దొంగతానికి పాల్పడినట్లు ఆయన తెలిపారు. ఈ మూఠలో మొత్తం 8 మంది ఉన్నట్లు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు ,ఐదు మంది నిందితులతో పాటు దొంగతనానికి గురైన 40 గొర్రెలను, రెండు బొలెరో వాహనాలు,5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసినట్లు ఆూఖ కరుణాసాగర్ రెడ్డి తెలిపారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురిని కూడా అతి తొందరలో పట్టుకుంటామని తెలిపారు.

# 17 నుంచి బస్సు యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించారు. ఈ నెల13న ఉదయం 11 గంటల నుంచి, 14 తేదీ ఉదయం వరకు నిరుద్యోగులకు జరిగిన అన్యాయంపై 24 గంటల పాటు నిరసన దీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 15న సాయుధ పోరాట వీరులను స్మరిస్తూ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించాలని పిలుపునిచ్చారు. 17వ తేదీన ఉదయం అన్ని పోలింగ్ కేంద్రాల్లో జాతీయ పతాకం ఎగురవేయాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్ లో అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా అమిత్ షా బహిరంగ సభ ఉంటుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా కార్యాక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. వివిధ కారణాలతో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, బండి సంజయ్, రఘునందన్ తదితరులు సమావేశానికి హాజరుకాలేదు. మొత్తంగా కమలనాథుల ప్రణాళికలు ఘనంగానే ఉన్నా.. ఏ మేరకు కార్యక్షేత్రంలో అమలు చేస్తారో చూడాలి.

### ఎన్నికలకు సంబంధించి 22 కమిటీలు

తెలంగాణపై బీజేపీ ఫోకస్‌ను క్రమంగా పెంచుతోంది. ఎన్నికలు దగ్గరపడుతోన్న తరుణంలో పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే తెలంగాణ బీజేపీ ఎన్నికల కమిటీలను నియమించే ప్రక్రియను వేగవంతం చేసింది. రాష్ట్ర ఎన్నికల ఇంఛార్జ్ ప్రకాశ్ జవదేకర్, సునీల్ బన్సాల్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికలకు సంబంధించి 22 కమిటీలను వేయాలని నిర్ణయించారు. అందులో కీలకమైన ప్రచార కమిటీ పగ్గాలు ఎవరికి ఇవ్వాలనే దానిపై శుక్రవారం విస్తృతంగా చర్చించారు.బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో స్టార్ క్యాంపెనర్‌గా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పనిచేస్తున్నారు. ఆయనకు ధీటుగా ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగిస్తే ఎలా ఉంటుందనే దానిపై చర్చ సాగింది. మునుగోడు ఎన్నికల ఓటమి తర్వాత ఇన్ యాక్టివ్‌గా ఉన్న రాజగోపాల్ రెడ్డిని యాక్టివ్ చేయడానికి ఈ పదవి ఉపయోగపడుతుందని పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. అధిష్టానానికి డీకే అరుణ, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రెండు పేర్లను రాష్ట్ర నాయకత్వం పంపినట్లు సమాచారం.ఇక మ్యానిఫేస్టో కమిటీ బాధ్యతలు మాజీ ఎంపీ వివేక్ లేదా కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మ్యానిఫేస్టో కమిటీలో మాజీ ఐఏఎస్, మాజీ ఐపీఎస్ లకు అవకాశం కల్పించనున్నారు. ఇక మీడియా కమిటీతో పాటు మొత్తం 22 కమిటీలను ప్రకటించడానికి బీజేపీ కసరత్తు చేస్తోంది. ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన నేతలను ఖాళీగా ఉంచకుండా పార్టీకి వినియోగించుకోవాలని లెక్కలు వేస్తున్నారు. కమిటీ కసరత్తు దాదాపు పూర్తయ్యింది. అధిష్టానం ఆమోద ముద్ర వేసి విడుదల చేయడమే తరువాయి అన్నట్టుగా ఉంది.దీంతో మొత్తానికి నేతలకు పనివిభజనలో భాగంగా కీలకమైన నేతలందరికీ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నారు. అయితే ఎవరి పనులు వారు చేసుకుంటారో.. ఒకరి దాంట్లో ఒకరు జోక్యం చేసుకుని చిందరవందర చేసుకుంటారో చూడాల్సి ఉంది. తెలంగాణపై బీజేపీ పెట్టిన నజర్ ఏమేర ఫలిస్తుందో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# హైదరాబాద్‌లో పెరుగుతున్న భూముల ధరలు కేవలం ట్రైలర్ మాత్రమే

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉందని చెప్పారు. గతంలో తాగు నీరుకు హైదరాబాద్ నగరంలో ఎప్పుడూ ఇబ్బంది ఉండేదని, సీఎం కేసీఆర్ దార్శకనికతతో కృష్ణా, గోదావరి నదుల నుంచి వందల కిలోమీటర్లు నీళ్లు తీసుకువచ్చి నగరవాసులకు తాగునీరు అందిస్తు న్నామని తెలిపారు. ఇటు కాళేశ్వరం, అటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 10 శాతం తాగు నీటిని అందిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌కు భవిష్యత్తులో తాగునీటి కొరత ఉండదని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చెబుతూ ఉంటారని, సినీ హీరో రజినీకాంత్ లాంటి వాళ్ళు కూడా ఇది న్యూయార్కా లేక హైదరాబాదా అనే సందేహం వచ్చిందన్నారని గుర్తుచేశారు. విశ్వనగరంగా పోటీపడాలంటే మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వరకు మెట్రో టెండర్లు కూడా పూర్తయాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నగరం చుట్టూ మెట్రో కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టిందని తెలిపారు. రాజధాని నగరానికి ఏ రంగంలో పెట్టుబడులు రావాలన్నా.. శాంతి భద్రతలు చక్కగా ఉండాలన్నారు. గతంలో ఏ పండుగొచ్చినా హైదరాబాద్‌లో వారం రోజుల పాటు కర్ఫ్యూ ఉండేదని, అయితే తెలంగాణ వచ్చిన తర్వాత అలాంటి పరిస్థితి ఇప్పటివరకు రాలేదని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగం హైదరాబాద్?కే పరిమితం కాలేదు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పెరిగిందని వెల్లడించారు. మెట్రో రైలును విస్తరిస్తామని, మూసీ సుందరీకరణ చేస్తామన్నారు. గొప్ప విజనరీ లీడర్ మన కేసీఆర్ ఉన్నారని, హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

హైదరాబాద్ అంటే గచ్చిబౌలి, కొండాపూర్ అని కొంత మంది విమర్శి స్తున్నారని, న్యూయార్క్ లాంటి నగరాల్లో కూడా కొన్ని పాత పట్టణాలు ఉన్నాయని చెప్పారు. స్కై టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని, గ్రీన్ బిల్డింగ్స్?ని ప్రోత్సహిస్తున్నదని వెల్లడించారు. డబ్బా బిల్డింగులే కాదు.. అట్రాక్టివ్?గా కూడా నిర్మాణాలు జరగాలని సూచించారు. హైదరాబాద్ పడమరవైపే కాకుండా మిగతావైపుల కూడా బిల్డర్లు అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున వసతులు కల్పించిందని, సౌత్, ఈస్ట్ హైదరాబాద్‌పై బిల్డర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## తుక్కుగూడలో ఉద్రిక్తత

### శ్రీశైలం జాతీయ రహదారి దిగ్బంధం



**రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు :** మహేశ్వరం నియోజకవర్గం, తుక్కుగుడ మునిపల్ లో ఉద్రిక్తత శనివారం ఉద్రిక్తత నెలకొంది. తుక్కుగూడ మున్సిపాలిటీ బస్టాండ్ చౌరస్తాకు స్థానికులకే డబుల్ బెడ్ రూమ్స్ ఇవ్వాలని బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. . డబుల్ బెడ్ రూం స్థానికులకు ఇవ్వాలని డిమాండ్ చేసారు. పాతబస్తీ మజిలీస్ వారికి ఇవ్వకూడదని పెద్ద ఎత్తున స్థానికులు బిజెపి కార్యకర్తలు రోడ్డుపై కొచ్చి ఆందోళన కి దిగారు. శ్రీశైలం జాతీయ రహదారి దిగ్బంధం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. అందోళనకారులను అరెస్టు చేశారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేంద్ర గౌడ్, అందేలా శ్రీరామ్ యాదవ్,బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహ రెడ్డి ని పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## సిద్ధిపేట జిల్లాలో బీజేపీకి భారీ షాక్





**సిద్దిపేట- ప్రభాత సూర్యుడు :** సిద్ధిపేట జిల్లాలో బీజేపీకి షాక్ తగిలింది. బీజేపీ జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు మహ్మద్ నయిమొద్దీన్, బీజేపీ జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖలీల్, బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రెసిడెంట్ ఫర్జానా బేగం, సిద్ధిపేట టౌన్ మైనారిటీ ప్రెసిడెంట్ యాసీన్ హుస్సేన్ లు ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో బీఆర్ఎస్ లో చేరారు. హైదరాబాదులో శుక్రవారం సాయంత్రం బీజేపీ జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు మహ్మద్ నయిమొద్దీన్, బీజేపీ జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖలీల్, బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రెసిడెంట్ ఫర్జానా బేగం, సిద్ధిపేట టౌన్ మైనారిటీ ప్రెసిడెంట్ యాసీన్ హుస్సేన్ లు తమ అనుచరులతో రాష్ట్ర మంత్రి హరీశ్ రావు సమక్షంలో దాదాపు 60 మంది బీఆర్ఎస్ లో చేరారు. అనంతరం పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలోకి మీ అందరికీ స్వాగతం. తెలంగాణ అంటే గంగా జమున తెహజీబ్ లా కేసీఆర్ నిలిపారు. రాష్ట్రాన్ని ముఖ్య మంత్రి మత కల్లోహాలు లేకుండా కాపాడుతున్నారు. దేశంలోనే మన రాష్ట్రంలోమాత్రమే మైనార్టీలు భద్రంగా ఉన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిద్రపోని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. మన దగ్గర సీఎం కేసీఆర్ ఉండబట్టే శాంతి భద్రతలు ఉన్నాయి. అన్ని వర్గాలను కాపాడుకునే, అన్ని మతాలను గౌరవించే నాయకుడు కేసిఆర్. దసరా, బతుకమ్మ పండుగలప్పుడు హిందువులకు, రంజాన్ మాసంలో ముస్లింలకు, క్రిస్టమస్ సమయంలో క్రిస్టియన్లకు బట్టలు పంపిణీ చేస్తారు. దేశంలో మైనార్టీల విద్య కోసం ఎంత ఖర్చు చేస్తారో, వారి కోసం ఎన్ని స్కూళ్లు ఉన్నాయో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే అన్ని ఉన్నాయి. ముస్లిం సోదరుల కోసం అజ్మీర్ దర్గాలో తెలంగాణ హౌస్ కట్టిస్తూ అండగా నిలిచారు. అలాగే సిద్ధిపేటను జిల్లా చేసి, గోదావరి జలాలను తెచ్చి ఇప్పుడు సిద్ధిపేటకు రైలు కూడా తెచ్చి అభివృద్ధి చేసి సిద్ధిపేటను ఆదర్శంగా నిలిపింది ముఖ్య మంత్రి కెసిఆర్. ముస్లిం మైనారిటీలకు బీఆర్ఎస్ రక్షణ కల్పిస్తుందని అన్నారు.

## మేడ్చల్ ఆర్టీయేకు కాసుల పంట

**మేడ్చల్- ప్రభాత సూర్యుడు :** మేడ్చల్ రవాణా శాఖ ఫ్యాన్సీ నంబర్ టాప్ గేర్ లో దూసుకెళ్లింది. శుక్ర వారం విడుదలైన ఫ్యాన్సీ నంబర్లపై ఒక్కరోజే రూ.36.45 లక్షల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. దీనిలో అత్యధి కంగా ఒక్క 9999 నంబర్కు రూ. 9,99,999 లక్షలు పలికింది. వెంకట ప్రణీత్ డెవలపర్స్ నుంచి 9999 నంబరు రూ.10 లక్షలు వెచ్చించగా, , మిగతా ఫ్యాన్సీ నంబర్లపై ఆదాయం సమకూరిన్నట్టు మేడ్చల్ రవాణా శాఖా అధికారి జిల్లా కిషన్ తెలిపారు. ప్రభుత్వం ఆన్లైన్లో ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా పార దర్శకంగా వాహనాల నంబర్లను బహి రంగంగా ప్రకటించడంపై ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో వినియోగ దారులకు మరింత నమ్మకాన్ని కల్పిం చిందని చెప్పారు.

## ప్రమాదవశాత్తు చెరువు కుంట లో పడి వ్యక్తి మృతి

**మేడ్చల్- ప్రభాత సూర్యుడు :** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు చెరువు కుంట లో పడి బత్తుల సురేష్ 42 సం"లు వ్యక్తి మృతి , వృత్తిరీత్యా కాటికాపరిగ జీవనం సాగిస్తున్న సురేష్ తాగిన మైకంలో నాగారంలోని దాయర కుంట లో పడి మృతిచెందాడు. తెల్లవారుజామున మృత దేహం నీటిలో పైకి తేలడంతో పోలీసుల కు సమాచారం ఇచ్చిన స్థానికులు , కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## కొండచిలువ హతం

**నూజివీడు- ప్రభాత సూర్యుడు :** సుమారు 15 అడుగుల కొండచిలువను చూసి వారం రోజులుగా గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం అన్నవరం శివారు వెంకటాద్రిపురం గ్రామంలో ఘటన జరిగింది. ఒక ఇంటి యజమాని కోడిని తింటూ కనబడ్డ కొండచిలువ,స్థానికులు వెళ్లి పరిశీలించగా అక్కడ ఖాళీగా ఉన్న పొదల్లోకి వెళ్ళిపోయింది. వారం రోజులుగా గ్రామస్తులు కంటిమీద కునుకు లేకుండా చేసింది. చివరకు గ్రామస్తుల సహకారంతో ప్రొక్లైన్ తెచ్చి బాగు చేస్తుండగా ఒక్కసారిగా కంటపడడంతో ఆ కొండ చిలువను చంపారు.

## ఎమ్మెల్యేల బంధుగా మారిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### తెలంగాణలో అత్యధికంగా దగా పడింది దళిత సమాజమే

### పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శ

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు**



:గృహలక్ష్మి, బీసీ , మైనార్టీ , దళిత బంధు అనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎమ్మెల్యేల బంధుగా మారిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ,కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కేవలం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకే కాకుండా కంప్యూటర్ ఆధారిత అర్హుల ఎంపిక అన్ని పథకాలకు వర్తింపజేయాలని జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాబోయే ఎన్నికల లోపేదళిత బంధు గ్రౌండింగ్ చేయకుండ దళితులను ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం లబ్దిదారుల ఎంపికలో ప్రజా ప్రతినిధుల జోక్యం లేకుండ, అవినీతికి తావులేకుండ పారదర్శకత కోసం కంప్యూటర్ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని చెబుతున్న మంత్రి కేటీఆర్ పారదర్శకత కేవలం డబుల్ బెడ్ రూం పథకానికేనా..అన్ని సంక్షేమ పథకాలకు వర్తిస్తుందా లేదా మంత్రి సమాధానం చెప్పాలన్నారు.కాంగ్రెస్ పాలనలో అర్హులందరికి ఇళ్ల కేటాయింపు, స్థల సేకరణ చేపట్టామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూం పథకం కనుమరుగైందని, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు బీఆర్ఎస్ మొదటి సారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మించినవేనన్నారు. ఇంటి నిర్మాణ వ్యయం పదేళ్లలో రెట్టింపు కాగా, స్వంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం పేరిట రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని రూ. 3లక్షలకు కుదించారనీ విమర్శించారు.

2022-23లో స్వంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ప్రతి నియోజకవర్గంలో 3000 ఇళ్ల నిర్మాణం కోసం రూ.12 వేల కోట్లు కేటాయించి, బడ్జెట్లో ఆమోదించినా ఒక్క ఇల్లు నిర్మించక రూపాయి కూడా ఖర్చు చేయలేదని జీవన్ రెడ్డి విమర్శించారు.అలాగే2023-24లో సైతం మరోమారు స్వంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారి కోసం రూ.12 వేల కోట్లు కేటాయించినా, ఆచరణ ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అత్యధికంగా దగా చేయబడింది దళిత సమాజమేనని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దళితులకు విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్ తోపాటు జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాల్లో సైతం నిధులు కేటాయించాలని పేర్కొన్నారని ఈ మేరకు దళితుల సంక్షేమం కోసం నిధులు కేటాయించి, బడ్జెట్లో ఆమోదించిన రూ.40వేల కోట్ల నిధులను వెచ్చించకుండ దళితుల హక్కులు కాలరాశారని విమర్శించారు. దళితబంధు పథకం అర్హుల ఎంపిక ప్రక్రియలో కలెక్టర్ తోపాటు ప్రజాప్రతినిధులని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసి రెండున్నర నెలలు గుడుస్తున్నా ఇంకా స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు అంటే ఎమ్మెల్యేనా..ఎంపీయా.. సర్పంచా ఎవరో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.దళిత బంధు అర్హుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించేలా దరఖాస్తులు ఎక్కడ స్వీకరిస్తారు.. గ్రామ సభ ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేస్తారా.. ఎంపిక ప్రక్రియలో జిల్లా కలెక్టర్ పాత్ర ఏమిటీ.. వంటి అంశాలపై కలెక్టర్ పత్రికాముఖంగా ప్రకటన చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. దళిత బంధు ఎంపికలో వితంతువులు, ఒంటరి మహిళలకు, ఇప్పటి వరకు లబ్ధి పొందని కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఎస్సీ , బీసీ , మైనార్టీ సెల్ స్వయం ఉపాధి పథకాలకు నిధులు మంజూరు చేయడం నిలిపివేశారని ఆరోపించారు.

సంక్షేమ పథకం కావాలంటే అర్హులు ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ఎద్దేవా చేస్తూనే ఇదేనా పారదర్శకత.. ఇదేనా ప్రజాస్వామ్యం.. బీసీ బంధు, మైనార్టీ బంధుకు పారదర్శకత వర్తించదా అని జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు.తెలంగాణ రాష్ట్రంలోని అన్ని సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక కోసం ప్రజా ప్రతినిధుల జోక్యం లేకుండా కంప్యూటర్ ఆధారిత ఎంపిక చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యులు బండ శంకర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దర రమేశ్ బాబు, కాంగ్రెస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బొల్లి శేఖర్, సీనియర్ నాయకులు తాటిపర్తి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, కౌన్సిలర్ నక్క జీవన్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిరాజొద్దీన్ మన్సూర్, నాయకులు దాసరి సతీశ్, నక్క రమేశ్, దులూరి సాయి, చందా రాధాకిషన్,మహిపాల్ , కాంగ్రెస్ పార్టీ జగిత్యాల రూరల్ మండలాధ్యక్షుడు జున్ను రాజేందర్, బండారు స్వామి, జిల్లా మత్స్యశాఖ విభాగం అధ్యక్షుడు తోపారపు రజనీకాంత్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుండా మధు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులు సైతం వైద్యవిద్యార్థులకు పాఠాలు చెప్పగలరు

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు**

నిరక్షరాస్యులు సైతం తమ శరీర దానంతో వైద్యవిద్యార్థులకు పాఠాలు చెప్పగలరని నేత్ర,శరీర, అవయవ, రక్త దానాల పట్ల విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరమని అమ్మ నేత్ర, అవయవ, శరీర, రక్త దాతల ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు గంజి ఈశ్వర లింగం అన్నారు. శ్రీనిధి, శ్రీ ప్రతిభ పాఠశాలల్లో ఆయన నేత్ర, రక్త,అవయవ, శరీర దానంపై శుక్రవారం జగిత్యాల లోని శ్రీనిధి ఓలంపియాడ్ హై స్కూల్, శ్రీ ప్రతిభ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన అవగాహనా తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తను మాట్లాడుతూ మూఢనమ్మకాల వల్ల చనిపోయిన వారి నేత్ర, దేహం అవయ వాలను కాల్చి బూడిద చేస్తూ లేదా పూడ్చి పెట్టి మట్టిలో కలిపేస్తున్నారని ఆవేదన చెందారు. దేశంలో పదిలక్షల మంది అభాగ్యులు కార్నియా లోపంతో అంధత్వంతో బాధపడుతున్నారని ప్రతిఒక్కరు మతాలు, మతవిశ్వాసాలకు అతీతంగా చనిపోయిన తర్వాత నేత్రాల్లోని కార్నియా పోరను దానం చేయడం వల్ల అంధులకు చూపు వచ్చి ఈ సమస్యను దేశం అధిగమిస్తుందన్నారు. నేత్ర దానంతో మరో జన్మ పాటు చూస్తూ జీవించి ఉండవచ్చని అన్నారు. ప్రపంచంలోకెల్ల అత్యంత తక్కువ జనాభా, విస్తీర్ణం గల శ్రీలంక దేశం నేత్ర దానాల్లో ముందు ఉందని ఈశ్వర లింగం చెప్పారు. దేశంలో అనేకమంది విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించుటకు ఆసక్తి చూపుతుంటే మెడికోలకు అనాటమి శాస్త్రం కీలకం కాగా దేశంలో మరణానంతరం శరీరాలను వైద్య కళాశాలలకు ఇవ్వకుండా కాల్చి బూడిద చేయడం, పూడ్చి మట్టిలో కలిపేయడం చేస్తు న్నారని ఆవేదన చెందారు. నిరక్షరాస్యులు సైతం తమ శరీర దానంతో వైద్యవిద్యార్థులకు పాఠాలు చెప్పగలరని ఈశ్వర లింగం అన్నారు. మరణం అనంతరం శరీర దానం కుటుంబ సంప్రదాయం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి, పాత్రికే యులు ఆముద లింగారెడ్డి, అమ్మ అవయవ దానం ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ జగిత్యాల జిల్లా కన్వీనర్ పెద్ది మహేశ్వర్ రెడ్డి, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముసిపట్ల రాజేందర్, శ్రీనిధి హై స్కూల్ ప్రిన్సిపాల్ మేఘమాల, శ్రీ ప్రతిభ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ కే అమీర్,ఉపాధ్యాయులు ఎదు లాపురం నాగరాజు, తిరుపతి రెడ్డి,పుట్టపాక శ్రీనివాస్, రాహుల్ సింగ్, తాటిపాముల రఘుపతి, చంద్రశేఖర్, గంగాధర్,బొలిశెట్టి శ్రీనివాస్,స్వరాజ్ ఉపాధ్యాయనిలు సహేళ, రచన తోపాటు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జీ 20 సదస్సులో కరీంనగర్ కళాకారులు

**కరీంనగర్ - ప్రభాత సూర్యుడు**

దేశాధినేతలు ఒక చోట సమావేశమయ్యే ఢిల్లీ జి -20 సమ్మిట్ లో తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన కళాకారులకు అరుదైన గౌరవం దక్కింది. ఈ సదస్సులో 20 దేశాలకు చెందిన ప్రతినిధుల చొక్కాలకు బ్యాడ్జీలను కరీంనగర్ కు చెందిన కళాకారులే తయారు చేశారు. ఈ వర్క్‌ను ఫిలిగ్రీ వర్క్ అని పిలుస్తారు. కోణార్క్ సూర్య దేవాలయాన్ని పోలి ఉండేలా రథ చక్రం తరహాలో ఈ బ్యాడ్జీలను తయారు చేశారు. జి - 20 సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి రెండు వందల బ్యాడ్జీలను ఆర్డర్ ఇచ్చి చేయించింది. జి - 20 సమ్మిట్‌లో స్టాల్ ఎగ్జిబిషన్ నిర్వహిం చడానికి తెలంగాణకు చెందిన కళాకారులకు కూడా అనుమతి దక్కింది. సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ హ్యాండీ క్రాఫ్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ అశోక్ ఆధ్వర్యంలో ఈ స్టాల్ నిర్వహిస్తారు. జి - 20లో మొత్తానికి కరీంనగర్ కళాకారులకు చెందిన స్టాల్ కొనసాగనుంది.కరీంనగర్ ఫిలిగ్రీ వర్క్ కు ఇంతటి అరుదైన గౌరవం దక్కడం ఇదే మొదటి సారి కాదు. గతంలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఉన్న సమయంలో ఆయన కుమార్తె ఇవాంకా ట్రంప్ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు కూడా వీరికి గుర్తింపు లభించింది. అంతేకాక, దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా కరీంనగర్ ఫిలిగ్రీ కళాకారులు కొంత మందికి నేషనల్ అవార్డ్ కూడా దక్కింది.జీ20 సదస్సుకు వచ్చే అతిథులకు అదిరిపోయే ఆతిథ్యం ఇవ్వబోతున్నట్లు ప్రత్యేక కార్యదర్శి ముక్తేశ్ పరదేశి తెలిపారు. స్థానిక వంటకాలతో పసందుగా విందు ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు చిరు ధాన్యాలతో కూడిన భారతీయ వంటకాల రుచి చూపిస్తామని చెప్పారు. అలాగే చిరు ధాన్యాల పౌడర్ తో ఫ్రూట్ సలాడ్లు, బెల్లం రాగి ఖీర్, స్పెషల్ మిల్లెట్ థాలి, మిల్లెట్ పలావ్, మిల్లెట్ ఇండ్లీ వంటి వంటకాలు చేయబోతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా రాజస్థానీ దాల్ బాటీ ఖుర్మా, పశ్చిమ బెంగాల్ రసగుల్లా, దక్షిణాది మసాలా దోశ బిహార్ లిట్టీ చోకాలనూ అతిథిలకు వండి వడ్డించబోతున్నట్లు స్పష్టం చేశారు. అలాగే చాందినీ చౌక్ వంటకాలను కూడా తినిపిస్తామని స్పష్టం చేశారు.

## పువ్వాడపై ఎమ్మెల్యే ఆగ్రహం

**ఖమ్మం- ప్రభాత సూర్యుడు:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ నిప్పులు చెరిగారు. తనకు టిక్కెట్ రాని తర్వాత తొలిసారి మంత్రి పువ్వాడపై ఎమ్మెల్యే రాములునాయక్ తనలో ఉన్న గూడుకట్టుకొని ఉన్న అసంతృప్తిని వెళ్లగక్కారు. 'మీరు రాష్ట్రానికి మంత్రా? లేక వైరాకు ఎమ్మెల్యేనా' అని సూటిగా ప్రశ్నించారు. గిరిజనుల మధ్య చిచ్చుపెట్టి చలి కాగుతున్నారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొమ్మిదిమంది బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి ఒక్కడివే గెలుద్దామా అనుకుంటున్నావా అని నిలదీశారు. ఎన్నికలు జరిగే వరకు నేనే వైరాకు ఎమ్మెల్యేని అని, ఇక్కడ నీ పెత్తనం ఏంటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో నీకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. శుక్రవారం వైరాలో నియోజక వర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో అత్యవసరంగా విస్తృతస్థాయి సమావేశాన్ని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో నిర్వహించారు.రెండోవిడత దళితబంధు లబ్ధిదారుల జాబితాలను మండలస్థాయి స్టీరింగ్ కమిటీల ప్రతిపాదనలతో ఎమ్మెల్యే రాములునాయక్ కలెక్టర్‌కు పంపించారు. అయితే బీఆర్ఎస్ అభ్యర్థి అయిన బాణోతు మదన్‌లాల్ తయారుచేసిన జాబితాను మంత్రి పువ్వాడ ఆమోదించడంతో దాన్ని పరిగణలోకి తీసుకున్నారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో మంత్రిపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయంగా తనను తొక్కాలని చూస్తే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని మంత్రి పువ్వాడను హెచ్చరించారు. తన నియోజకవర్గంలో మంత్రి పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఎవరిది వారు కడుకుంటే మంచిదని, ఎదువారిని కడగాలని చూస్తే గుణపాఠం తప్పదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కేసీఆర్ రాజులా, మంత్రి కేటీఆర్ యువరాజులా సుపరిపాలన చేస్తుంటే మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జిల్లాలో సామంతరాజులా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను గౌరవించి ప్రొటోకాల్ పాటించాలని తెలియదా అంటూ నిలదీశారు. మూడు సంవత్సరాలుగా తనను మంత్రి మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. మళ్లీ ఎన్నికలు జరిగే వరకు తానే ఎమ్మెల్యేనని రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలన్ని ఎమ్మెల్యేల ద్వారా అమలుచేస్తుంటే వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యేని అయిన తనను ఎందుకు అవమానిస్తున్నారని ప్రశ్నించారు. తనను కాదని బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ ఇచ్చిన దళితబంధు జాబితాను మంత్రి ఆమోదించి అధికారులకు ఎలా పంపించారని ప్రశ్నించారు. టిక్కెట్ వచ్చిన అభ్యర్థి మదన్‌లాల్ గిరిజనుడేనని ఆయన తన బావేనని ఆయన గెలుపు ఖాయమని ఈ పరిస్థితుల్లో గిరిజనులైన తమ మధ్య విభేధాలు సృష్టించి ఆమంటల్లో చలి కాసుకుంటున్నారని ఆరోపించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215